
సాక్షి పల్నాడు

మంగళవారం ∣ 28 ∣ నవంబర్ ∣ 2023



మహాకుంభాభిషేకం ప్రారంభం

పొన్నూరు: సాక్షి భావనారాయణస్వామి గుడిలో మహా కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కిలారి రోశయ్య దంపతులు పాల్గొన్నారు.



హంసలదీవి తీరానికి నాగశిలలు

కోడూరు: హంసలదీవి సాగరతీరానికి నాగశిలలు, నవగ్రహమూర్తుల విగ్రహాలు సోమవారం కొట్టుకువచ్చాయి. వీటికి భక్తులు పూజలు చేశారు.

అభయాంజనేయస్వామికి విశేష పూజలు



కర్లపాలెం: కార్తిక పౌర్ణమి సందర్భంగా తుమ్మలపల్లి గ్రామం అడవిలో ఉన్న అభయాంజనేయ స్వామికి సోమవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

న్యూస్‌రీల్

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): గుంటూరు డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయగడ్–గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్ రైలు, గుటూరు–రాయగడ్(17233) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–సికింద్రాబాద్(17015) ఎక్స్‌ప్రెస్‌లను డిసెంబర్ 4వ తేదీన రద్దు చేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్–భువనేశ్వర్(17016), హౌరా–చెన్నై సెంట్రల్(12839), చెన్నై సెంట్రల్–హౌరా(12840), వాస్కోడిగామా–షాలీమార్ (18048) ఎక్స్‌ప్రెస్ రైళ్లను డిసెంబర్ 3వ తేదీన రద్దు చేసినట్లు తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2023

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీ ఆవరణలో ఈనెల 29, 30వ తేదీల్లో 31వ రాష్ట్రస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2023 నిర్వహించనున్నట్లు రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి సభ్య కార్యదర్శి డాక్టర్ వై.అపర్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ టెక్నాలజీ కమ్యూనికేషన్స్, రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి(అప్‌కాస్ట్), పాఠశాల విద్యాశాఖ, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కందుకూరుకు చెందిన సీకే దాస్ అకాడమి, చారిటబుల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, కోనేరు లక్ష్మయ్య, ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌ల సహకారంతో సైన్స్ కాంగ్రెస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాద రావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), పలువురు ఉన్నతాధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

యార్డుకు 35,423 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 35,423 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 34,308 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.8,500 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 23,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,420 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 1,539, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 23,765, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 839.00 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి రోజా నుంచి 1,824 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పోటీ పరీక్షలకు పుస్తకాలు సిద్ధం చేయండి



గుంటూరుఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో గ్రూప్–1, 2 నోటిఫికేషన్లు విడుదల చేయనున్న దృష్ట్యా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన ప్రామాణిక పుస్తకాలను సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. సోమవారం అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన జేసీ రాజకుమారి అన్ని విభాగాలను పరిశీలించారు. పోటీ పరీక్షల విభాగంలో నిరుద్యోగులతో మాట్లాడి, వారికి ఎటువంటి స్టడీ మెటీరియల్, ప్రామాణిక పుస్తకాలు అవసరమనే విషయాన్ని తెలుసుకున్నారు. అన్ని రకాల పుస్తకాలు, గ్రంథాలను సిద్ధంగా ఉంచి, పాఠకులకు అవసరమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. గ్రంథాలయ సెస్ చెల్లించేలా స్థానిక సంస్థల అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ఆమె వెంట జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి ఉన్నారు.



పెదకాకాని మల్లేశ్వరస్వామి


శుభః శివాయ

పున్నమి చంద్రుడు వెన్నెల నవ్వులొలికినట్టు.. మంచుముత్యాలు విరిజల్లులై కురిసినట్టు.. పుణ్యజలసిరులు జీవధారలై అభిషేకించినట్టు.. వేదమంత్రాలు దివ్యాశీస్సులై ఘోషించినట్టు.. దీపారాధనలు హరివిల్లులై విరిసినట్టు.. మహాదేవుని మోము కోటికాంతులతో మెరిసినట్టు.. కార్తిక పౌర్ణమి శోభతో శైవక్షేత్రాలు తళుకులీనాయి. ఆధ్యాత్మికోత్సాహం వెల్లివిరిసింది. ఓం నమఃశివాయ.. శంభోశంకర అంటూ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రణమిల్లింది. భక్తిపారవశ్యంతో పులకించింది.



అమరేశ్వరా.. నమో : విశేషాలంకారంలో అమరేశ్వరుడు

కోటప్పకొండ కిటకిట



భక్తజన 'కోటప్ప' : కొండపై కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు



త్రినేత్రాయ.. త్రికోటేశా.. : ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరుడు

నరసరావుపేట రూరల్: పవిత్ర కార్తిక పౌర్ణమి, సోమవారం కలిసి రావడంతో ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ భక్తులతో పోటెత్తింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు త్రికోటేశ్వరుడిని దర్శించుకుని తరించారు. తెల్లవారుజాము నుంచే స్వామి దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. అయ్యప్ప మాలధారులు కొండ మీద రాత్రి నిద్రచేసి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నాలుగు గంటలకు స్వామికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉచిత దర్శనంతోపాటు శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం, అభిషేక దర్శనాన్ని భక్తులకు కల్పించారు. అభిషేక మండపంలో భారీగా అభిషేకాలు జరిగాయి. మహిళలు ఆలయం వెనక ఉన్న రావిచెట్టు, మహానందీశ్వరుడు ప్రతిమ, ఉసిరి చెట్టు వద్ద కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. నాగేంద్రుని పుట్ట వద్ద భక్తుల తాకిడి నెలకొంది. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ద్విచక వాహనాలు, కార్లతోపాటు గ్రామాల నుంచి భక్తులు ట్రాక్టర్లపై కొండపైకి రావడంతో పార్కింగ్ స్థలం కిక్కిరిసింది. వాహనాల రద్దీతో ప్రకృతి పర్యాటక కేంద్రం, టోల్‌గేట్ వద్ద పలుమార్లు ట్రాఫిక్ నిలిచిపోయింది. నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. రూరల్ ఎస్ఐలు రోశయ్య, హజరత్తయ్య సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. గిరి ప్రదక్షిణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే గిరి ప్రదక్షిణను భక్తులు ప్రారంభించారు. సోపాన మార్గంలోని గణపతికి పూజలు చేసి గిరిప్రదక్షిణకు శ్రీకారం చుట్టారు. అటవీశాఖతోపాటు పలువురు దాతలు భక్తులకు తాగునీరు అందజేశారు.

పోటెత్తిన పెదకాకాని



ప్రకా'శివాయ': ఓ వైపు దీపారాధనలు చేస్తున్న భక్తులు, మరోవైపు క్యూలైన్లలో దర్శనానికి వెళ్తున్న ప్రజలు



స్వామి దర్శనం.. దివ్య'ప్రసాదం': కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి దంపతులకు స్వామి ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

పెదకాకాని: కార్తిక పౌర్ణమి, సోమవారం సందర్భంగా పెదకాకాని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. వేకువ నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. తొలుత యజ్ఞాల బావి వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తిక దీపాలు వెలిగించారు. స్వామి, దేవేరులను దర్శించుకుని అభిషేకాలు చేశారు. పలువురు భక్తులు ప్రభలతో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెదకాకాని సీఐ సురేష్‌బాబు బందోబస్తు నిర్వహించారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి దంపతులు స్వామిని దర్శించుకున్నారు.

అమరారామం.. ఆధ్యాత్మికోత్సాహం

అమరావతి: అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయం కార్తిక పౌర్ణమి సందర్భంగా కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. తొలుత భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద కార్తిక దీపారాధనలు చేశారు. అనంతరం అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఫలితంగా శివపంచాక్షరీ నామంతో అమరేశ్వరాలయం ప్రతిధ్వనించింది. ఉదయం సుమారు 70కిపైగా బస్సులలో తరలివచ్చిన పంచారామ క్షేత్ర సందర్శన యాత్రికులు స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ కార్తిక సోమవారం విశిష్టతను వివరించారు. ఆలయ ఈవో వేమూరి గోపినాథశర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుమారు 20వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని సమాచారం. సీఐ ఎ.వి.బ్రహ్మం తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



ఆ'దర్శనీయం' : స్వామి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం

120అర్జీలు స్వీకరించిన జిల్లా జాయింట్ కలెక్టర్



స్పందనలో అర్జీదారుల సమస్య వింటున్న జేసీ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తూ జగనన్నకు చెబుదాం ద్వారా పరిష్కారం చూపేందుకు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో జగనన్నకు చెబుదాం (స్పందన)లో ప్రజల నుంచి 120 వినతిపత్రాలను స్వీకరించారు. ఆ ఫిర్యాదులను సంబంధిత శాఖల ఉద్యోగులకు పంపించి వెంటనే పరిష్కార మార్గం చూపించాలని సూచించారు. ఆ ఫిర్యాదులను కలెక్టరేట్ సిబ్బంది నమోదు చేసుకోగా, వలంటీర్లు అర్జీల తయారీలో సహకారం అందించారు. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వారికి రెడ్‌క్రాస్ సొసైటీ సాయంతో అన్నదానం ఏర్పాటు చేశారు. దాతలను జేసీ సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.వినాయకం, పులిచింతల ప్రాజెక్టు ప్రత్యేక అధికారి వసంతబాబు, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అందరికీ రాజ్యాంగ ఫలాలు

- విలువలకు ప్రాధాన్యమిస్తే ప్రలోభాలు లేని ఎన్నికలు సాధ్యమే
- ప్రభుత్వ పథకాలతో ఆర్థిక పరిపుష్టి
- టెన్త్ తర్వాత ఐదేళ్లు కష్టపడితే ఐదు తరాల భవితను మార్చవచ్చు
- గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు
- ఏఎన్‌యూలో రాజ్యాంగ దినోత్సవం



ప్రసంగిస్తున్న గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు

ఏఎన్‌యూ(గుంటూరు): ఈ దేశంలో మనం పొందుతున్నవన్నీ రాజ్యాంగ ఫలాలేనని గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు చెప్పారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఐజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐజీ మాట్లాడుతూ మనం రాజ్యాంగాన్ని చదువుతున్నాం కానీ వ్యక్తిగత, కుటుంబ జీవితంలో దానిని పాటించడం లేదని, అందుకే చాలా సమస్యలు వస్తున్నాయన్నారు. ఎంతో విశిష్టత ఉన్న భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందని పేర్కొన్నారు. చట్టం అమలులో ధనిక, పేద, వర్గ, కుల తేడాలు చూపినంతకాలం రాజ్యాంగ లక్ష్యం నెరవేరదన్నారు. యువత విలువలకు ప్రాధాన్యమిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని, మద్యం, డబ్బు, కులం, మతం వంటి ప్రలోభాలు లేని ఎన్నికలు చూడవచ్చన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు అణగారిన వర్గాలకు ఇస్తున్న పథకాల వల్ల ప్రజలు సోమరివారవుతారని కొందరు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. 70 ఏళ్ల కాలంలో రాజ్యాంగ విలువలకు అనుగుణంగా పేదలకు అన్నీ అందితే ఇప్పుడు పథకాలు, ఉచితాలు ఇవ్వాల్సిన అవసరమే ఉండేది కాదన్నారు. పేదలకు పథకాలు అందించడం వల్ల ఆర్థిక పరిపుష్టి సాధ్యమవుతుందన్నారు. గతంలో జరిగిన అవినీతిని దృష్టిలో ఉంచుకునే డీబీటీ(నేరుగా లబ్ధిదారునికి చేరవేత) విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. యువకులు పదో తరగతి తర్వాత ఐదేళ్లు కష్టపడితే ఐదు తరాలను సుఖపెట్టవచ్చని స్పష్టం చేశారు. ఏపీ అగ్రికల్చర్ స్పెషల్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్ మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల ప్రయోజనాలు పరిరక్షించే నిర్దిష్టమైన అంశాలను అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. చాలా దేశాల్లో వ్యవస్థలు సంక్షోభానికి గురవుతున్నా మన దేశంలో ఆ పరిస్థితి రాకపోవడానికి మన రాజ్యాంగమే కారణమన్నారు. అంబేడ్కర్ లక్ష్యాలను గుర్తెరిగి యువత రాజ్యాంగ విలువల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వీసీ పి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచంలోకెల్లా అత్యుత్తమ అంశాలను అంబేడ్కర్ మన రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. రాజ్యాంగం గురించి తెలుసుకోని విద్యార్థులు పరిపూర్ణ పౌరులు కాలేరన్నారు. అనంతరం విద్యార్థులు, అతిథులతో వీసీ రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, అంబేడ్కర్ అధ్యయన కేంద్రం అధ్యాపకులు అశోక్‌కుమార్, డాక్టర్ అబ్రహం లింకన్, సీడీసీ డీన్ కె.మధుబాబు, పరీక్షల కో–ఆర్డినేటర్ ఆచార్య ఉదయ కుమార్, ప్రిన్సిపాల్స్ సీహెచ్ స్వరూపరాణి, సిద్దయ్య, శ్రీనివాసరెడ్డి, ప్రమీలారాణి ప్రసంగించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

విద్యుద్దీభవ

- కరెంట్ కష్టాలకు పరిష్కారం
- రూ.55.82 కోట్లతో ఉపకేంద్రం నవీకరణ
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- గురజాల, సత్తెనపల్లి, మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల్లో తీరనున్న లోఓల్టేజ్ సమస్య



విద్యుత్ ఉప కేంద్రం ప్రారంభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ మురళీ కృష్ణయాదవ్

పిడుగురాళ్ల: వ్యవసాయానికి, పరిశ్రమలకు, గృహాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కృషి చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 28 విద్యుత్ ఉప కేంద్రాల నవీకరణ కార్యక్రమం చేపట్టింది. దీనిలోభాగంగా పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని కొండమోడు వద్ద 220/132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రపంచ బ్యాంక్ నిధులు, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ నిధులు సుమారు రూ.55.82 కోట్లతో నవీకరించింది. ఈ పనులు పూర్తికావడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలకు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు.

'ఉప'యోగాలెన్నో..

ఈ 220/132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నవీకరణ వల్ల గురజాల, మాచర్ల, సత్తెనపల్లి, వినుకొండ నియోజకవర్గాల్లో లోఓల్టేజ్ సమస్య పరిష్కారమవుతుంది. సేద్యంతోపాటు పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు నాణ్యమైన కరెంట్ సరఫరా అవుతుంది. ముఖ్యంగా రైతులకు పగటిపూట 9 గంటలపాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా సాధ్యమవుతుంది. తంగెడ, శావల్యాపురం, రెంటపాళ్ల, కారంపూడి, సత్తెనపల్లి, మాచర్లలోని 132 కేవీ ఉప కేంద్రాలకు నాణ్యమైన కరెంట్ అందుతుంది. అలాగే రెంటచింతల, తాడికొండల్లోని 220 కేవీ ఉపకేంద్రాలకు ప్రత్యామ్నాయంగా మారుతుంది. వేసవిలో ఆ కేంద్రాల్లో సమస్యలు తలెత్తి అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఇక్కడి నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది.

ఏర్పాట్ల పరిశీలన

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కొండమోడు విద్యుత్ ఉప కేంద్రాన్ని విద్యుత్ శాఖ ఎస్ఈ మురళీ కృష్ణయాదవ్ సోమవారం పరిశీలించారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ పద్ధతిలో కేంద్రాన్ని ప్రారంభించనున్న సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు. గురజాల ఆర్డీఓ రమాకాంత్‌రెడ్డి కూడా ఏర్పాట్లను పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ హరిబాబు, ఏడీఈ బాజీనాయక్, ఏపీ ట్రాన్స్‌కో ఈఈ పి.మంగయ్య, ఏపీ ట్రాన్స్‌కో ఏడీఈ ఎల్.పాపారావు, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.

ఇదొక మైలు రాయి



పిడుగురాళ్ల విద్యుత్ ఉప కేంద్రాన్ని నవీకరించడం ఓ మైలురాయి. ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం 200 ఎంవీ(మెగా ఓల్ట్ యాపియర్) కలిగి ఉంటుంది. పిడుగురాళ్ల పట్టణం, మండలం, బెల్లంకొండ, రాజుపాలెం, మాచర్ల, నకరికల్లు, మాచవరం, దాచేపల్లి, కారంపూడి, సత్తెనపల్లి, శావల్యాపురం మండలాలకు ఇక్కడి నుంచి విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరుగుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉపకేంద్రాన్ని ప్రారంభించనున్నారు. దీనికోసం అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశాం.

– పి.మంగయ్య, ఏపీ ట్రాన్స్‌కో ఈఈ

ఆనందంగా ఉంది



సబ్‌స్టేషన్‌ను ఆధునీకరించడం ఆనందంగా ఉంది. రైతులకు పగటిపూటే 9 గంటలు నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడం భేష్. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

– ముక్కాల పిచ్చయ్య, రైతు, పిడుగురాళ్ల

పరిశ్రమలకు వరం



ఉపకేంద్రం నవీకరణ పరిశ్రమలకు వరం. అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా సాధ్యమవుతుంది. దీనివల్ల పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంది. ఫలితంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

– మేకపోతు సైదారెడ్డి, చిప్స్ మిల్లు యజమాని, పిడుగురాళ్ల

ఆడుదాం ఆంధ్ర ద్వారా క్రీడాకారులకు ప్రోత్సాహం

- రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్
- కలెక్టరేట్‌లో లోగోను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



కలెక్టరేట్‌లో లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్, స్టెప్ సీఈఓ పల్లవి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయిమార్కొండారెడ్డి, జేసీ శ్యామ్‌ప్రసాద్, జిల్లా అధికారులు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా చేపట్టిన గొప్ప కార్యక్రమం ఆడుదాం ఆంధ్ర అని జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా నోడల్ అధికారి ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించి సచివాలయాల్లో సోమవారం నుంచి ప్రారంభమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పాలపాడురోడ్డులోని ప్రశాంతినగర్ సచివాలయం–2లో పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ క్రీడా పోటీలకు సంబంధించి కిట్లు అందాయా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు వచ్చిన పలువురు క్రీడాకారులతో ఆయన ముఖాముఖి మాట్లాడుతూ ఏయే పోటీలలో పాల్గొంటున్నది వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈరోజు నుంచి డిసెంబర్ 13వ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ ప్రారంభాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో జరిగిన లోగో ఆవిష్కరణలో కలెక్టర్ ఎల్.శివశంకర్, స్టెప్ సీఈఓ పల్లవి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, క్రీడల హెడ్ కోచ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనన్య వైద్యశాలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని అనన్య వైద్యశాలపై, డ్యూటీ డాక్టర్‌పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ కోరారు. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ప్రభాకరరావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ఈవిధమైన దాడులు చేయడం వలన అవసరమైన రోగులు వైద్యసేవలు కోల్పోతారన్నారు. అత్యవసర సమయంలో వైద్యులు చికిత్స అందించకపోతే ఎన్నో ప్రాణాలు కోల్పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యశాలలో డ్యూటీ డాక్టర్ సైదానాయక్‌పై దాడి చేసి, వైద్యశాలలో విలువైన పరికరాలను ధ్వంసం చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేగాక ఈ ఘటనకు నిరసనగా మంగళవారం ఐఎంఏ పరిధిలోకి వచ్చే ప్రైవేట్ వైద్యశాలలో ఓపీని బంద్ చేసి ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి ఫణిదర్, పూర్వ అధ్యక్షుడు కిషోర్, కాబోయే అధ్యక్షుడు నందా, స్థానిక ఐఎంఏ అధ్యక్షుడు జెట్టి శ్రీనివాసరావు ఉన్నారు.

వెలకట్టలేం.. పూర్వ విద్యార్థుల సాయం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న సాయం వెలకట్టలేనిదని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి అన్నారు. సోమవారం వైద్య కళాశాలలో రూ. 15 లక్షలతో ఆధునికీకరించిన ఫోరెనిక్ మెడిసిన్ లెక్చర్ గ్యాలరీని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ పాదిల ప్రసాద్ అమెరికాలో స్థిరపడి లెక్చర్ గ్యాలరీ ఆధునికీకరణ కోసం రూ.15 లక్షలు విరాళం ఇచ్చారన్నారు. సుమారు రూ.80 కోట్లతో నిర్మాణం చేస్తున్న మాతా శిశు సంరక్షణ కేంద్రం పూర్వ వైద్య విద్యార్థుల విరాళాలతోనే జరుగుతున్నట్లు వెల్లడించారు. చదువుకున్న సంస్థలో ప్రస్తుతం ఉన్న విద్యార్థులు అత్యాధునిక వైద్య సౌకర్యాలతో విద్యను పొందాలని, రోగులు ఆధునిక సౌకర్యాలతో వైద్య సేవలు పొందాలనే మంచి ఆశయంతో పూర్వ వైద్య విద్యార్థులు కళాశాల అభివృద్ధికి, ఆసుపత్రి అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు సుబ్బారావు, శరత్‌చంద్ర, సుజ్ఞాన్, కృష్ణమూర్తి, జ్యోతి స్వర్ణకుమారి పాల్గొన్నారు.

పండిన మిర్చిని తీసుకొని సొమ్ము ఎగేశారు..

జగనన్నకు చెబుదాంలో ఎస్పీ 46 ఫిర్యాదులు స్వీకరణ

నరసరావుపేట: పండిన మిర్చిని తీసుకొని సగం చెల్లించి మిగతా సొమ్ము ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన కట్టా సాంబశివరావు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన)లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారితో జిల్లా ఎస్పీ 46 ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో సాంబశివరావు ఫిర్యాదును పరిశీలిస్తే.. తన పొలంలో పండిన 150 మిర్చి బస్తాలను పిడుగురాళ్లకు చెందిన ఇద్దరు వ్యక్తులకు రూ.14 లక్షలకు విక్రయించానన్నారు. వారు రూ.ఏడు లక్షలు ఇచ్చి మిగిలినవి ఒక వారంలో ఇస్తామని చెప్పారన్నారు. తర్వాత ఆ ఇద్దరిలో ఒకరు చనిపోగా రెండో వ్యక్తి నీ డబ్బులతో నాకేం సంబంధంలేదు, నీకు దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నాడని తనకు న్యాయం చేయమని ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. వాటి పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చి తక్షణ చర్యలు చేపట్టాలని, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు హెస్ట్ ఫార్ములేషన్ కంపెనీ ప్రతినిధులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీలు బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర పాల్గొన్నారు. ఎస్పీ స్పందనలో వచ్చిన ఫిర్యాదులు ఇలా..



ఫిర్యాదుదారుల సమస్య వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

కారు బాడుగకు తీసుకొని తాకట్టు పెట్టాడు

నాకు రెండు కార్లు ఉన్నాయి. వాటిలో ఒకటిని పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మూడు నెలలు అద్దె చెల్లిస్తానని తీసుకున్నాడు. అద్దె, కారు అడిగితే ఇవ్వట్లేదు. అతను వేరే వారికి తాకట్టు పెట్టుకున్నాడని తెలిసింది. తన కారు తనకు ఇప్పించి న్యాయం చేయండి.

–పిల్లుట్ల జ్ఞాన సతీష్‌కుమార్, పెట్లూరివారిపాలెం

డబ్బులు తీసుకొని బెదిరిస్తున్నారు

నా భర్త గ్రామానికి చెందిన వారి వద్ద కొంత డబ్బు అప్పు తీసుకుని రెండు ఖాళీ ప్రామిసరీ నోట్ల మీద సంతకాలు చేసిచ్చాడు. తీసుకున్న వాటిలో రూ.లక్ష మినహా మిగతా సొమ్ము చెల్లించాడు. అయితే వారు ఇంకా రూ.4.5 లక్షలు చెల్లించాలంటూ ఆ డబ్బుల కోసం బెదిరిస్తున్నారు. ఈ విషయంలో మాకు న్యాయం చేయాలి. – ఓ మహిళ, కారెంపూడి

వేసక్టమీపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి

నరసరావుపేట: కుటుంబ నియంత్రణలో స్త్రీలతో పాటు పురుషులు తమ వంతు భాగస్వామ్యం వహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి బి.రవి పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి డిసెంబరు నాలుగో తేదీ వరకు పురుషులకు నిర్వహించే శాశ్వత కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స వేసక్టమీ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ ఇద్దరు బిడ్డలు కలిగిన దంపతులు కుటుంబ నియంత్రణ శాశ్వత పద్ధతిని పాటించాలని కోరారు. వేసక్టమీ శస్త్ర చికిత్స చేయించుకోవాలని సూచించారు. దీని వలన ఆరోగ్యపరంగా ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావని అన్నారు. జిల్లా ఇన్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, జిల్లా గణాంకశాఖ అధికారి నీలకంఠేశ్వరరావు, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ షేక్ ఖాజావలి పాల్గొన్నారు.

రజకులను టీడీపీ ఓటు బ్యాంకుగా వాడుకుంది

ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు అంజిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): తెలుగుదేశం పార్టీ రజకులను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంది తప్ప రజకులకు ఏమైనా న్యాయం చేసిందా అని ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం అరండల్ పేటలో రజక సంఘాల నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులాలు మాకు బ్యాక్ బోన్ లాంటిది అని చెప్పుకునే టీడీపీ పార్టీ రజకుల ఐక్యత కోసం రజక మహాసభ ఏర్పాటు చేస్తే ఒక్క టీడీపీ నాయకులైన హాజరయ్యారా అని ప్రశ్నించారు. రజకులకు 50 సంవత్సరాలకే పెన్షన్ సదుపాయం కల్పిస్తామని చెప్పి నన్ను టీడీపీ పార్టీలోకి ఆహ్వానించి రజకులకు పెన్షన్ ఇవ్వకుండా మభ్య పెట్టారని మండిపడ్డారు. గుంటూరు నగరంలో రజకుల చెరువు ఆక్రమించి టీడీపీ కార్యాలయం కట్టిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అచ్చెంనాయుడు కుటుంబంలో మూడు ఎమ్మెల్యే టికెట్లు, ఒక ఎంపీ టికెట్ ఇచ్చారని వారి కంటే ఎక్కువ జనాభా గల మాకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర జనాభాలో 4.7 శాతం ఉన్న రజకులకు ఒక ఎమ్మెల్యే, ఎంపీ టికెట్, కార్పొరేషన్ చైర్మన్ ఇచ్చారా అని ప్రశ్నించారు. టీడీపీలో రజకులను ఎదగనీయకుండా కొన్ని దుష్టశక్తులు అడ్డుపడుతున్నాయన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని రజకుల ఓట్ల కోసం టీడీపీ కుయుక్తులు పన్నుతోందని దీనికి రజకులంతా తగిన బుద్ధి చెప్పాలన్నారు.

చట్టబద్ధమైన పాలనతో పటిష్టమైన న్యాయవ్యవస్థ

కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్

గుంటూరు ఎడ్యుకేషన్: చట్టబద్ధమైన పాలన తో పటిష్టమైన న్యాయవ్యవస్థను నెలకొల్పగలమని వైఎస్సార్ కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ పేర్కొన్నారు. సోమవారం సాంబశివపేటలోని ఏసీ లా కళాశాలలో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని ''చట్టబద్ధపాలన–రాజ్యాంగం'' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ మన దేశంలో చట్టబద్ధపాలన అమలు చేయడంలో న్యాయవ్యవస్థ పటిష్టంగా పని చేస్తుందనీ, రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక అధికరణాలు, చట్టాలను చైతన్యవంతంగా అర్థం చేసుకుని ఉపయోగించుకోవాలని కోరారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ చట్టబద్ధమైన పాలనతోనే నాగరిక సమాజాభివృద్ధిని చూడగలమని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన సమాజం లేకుంటే మానవ సమాజం అథోగతి పాలవుతుందని, ఆటవిక పాలనతో ప్రజలు అనేక కష్టాల పాలవుతారని అన్నారు. చట్టబద్ధ పాలన లేకుంటే దళితులపై దాడులు మరింతగా జరిగేవన్నారు. రాజ్యాంగాన్ని అమలు చేయడం ద్వారానే సమ సమాజం ఏర్పడి, సమాజంలోని ప్రతి ఒక్కరికీ అన్ని రంగాల్లో అవకాశాలు దక్కుతున్నాయని తెలిపారు. ఏసీ లా కళాశాల కరస్పాండెంట్ జి. ఎలీషా మాట్లాడుతూ మనుషులందరు సమానులే అనే సౌభ్రాతృత్వ భావన లేకపోతే దేశం అభివృద్ధి చెందదని అన్నారు. మహిళలు సమానత్వం సాధించడంలో దళిత స్త్రీ శక్తి చేస్తున్న పోరాటాలు చాలా అవసరమన్నారు. సభాధ్యక్షురాలు గెడ్డం ఝాన్సీ మాట్లాడుతూ మహిళలపై జరిగే అన్ని రకాల హింసను రూపుమాపేందుకు అంతర్జాతీయంగా చేపట్టిన ప్రచారోద్యమంలో భాగంగా దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు 16 రోజుల పాటు దళిత, ఆదివాసీ స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. సదస్సులో ఏసీ లా కళాశాల ప్రిన్సిపాల్ అమృతవర్షిణి, ఏఎన్‌యూ లా అసోసియేట్ ప్రొఫెసర్ సతీష్, అమల కుమారి, పలువురు న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరు యువకుడికి ఆస్ట్రేలియా అవార్డు

గుంటూరు మెడికల్: వాతావరణ మార్పులపై గుంటూరుకు చెందిన ఎస్.వి.శరత్‌చంద్ర చేసిన పరిశోధనకు ఆస్ట్రేలియాలోని గ్రిఫిత్ విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ స్కాలర్‌షిప్‌ను, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ స్కాలర్‌షిప్‌లను అందజేసింది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న, తక్కువ అభివృద్ధి చెందిన దేశాల్లో హీట్ హెల్త్ యాక్షన్ ప్లాన్ పరిశీలించడానికి, విపరీతమైన వేడి మానవులను ఎలా ప్రభావితం చేస్తోందో పరిశీలించడానికి ఆస్ట్రేలియాలోని గ్రిఫిత్ విశ్వవిద్యాలయంలో డాక్టర్ షానన్ రూథర్‌ఫోర్డ్, డాక్టర్ హోక్, డాక్టర్ ఎడ్ మోర్గాన్‌లు పరిశోధన చేస్తున్నారు. వారి పర్యవేక్షణలో శరత్‌చంద్ర తన పరిశోధన పత్రాలను సమర్పించారు. గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి, డాక్టర్ జ్యోతి ల తనయుడు ఎస్.వి.శరత్‌చంద్ర రూర్కెలాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బయోటెక్నాలజీలో బీటెక్ చదివాడు. అనంతరం రాజకీయ శాస్త్రంలో మాస్టర్ డిగ్రీ, హైదరాబాద్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో వాతావరణ మార్పులో ఎంటెక్ మాస్టర్ డిగ్రీ చదివాడు. వాతావరణ మార్పుకు సంబంధించి అంతర్జాతీయ ప్రాజెక్టుల్లో పరిశోధకుడిగా పనిచేశాడు. విపరీతమైన వేడి, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మానవ ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని శరత్‌చంద్ర తెలిపాడు. అందరం కలిసి ఈ సమస్యను పరిష్కరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రెండు ప్రతిష్టాత్మకమైన ఆస్ట్రేలియన్ పరిశోధన అవార్డులను అందుకున్న శరత్‌చంద్రకు గుంటూరుకు చెందిన పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు.

రైతులకు తక్కువ కాలం పంటలే మేలు



కలెక్టరేట్‌లో అధిక దిగుబడులు సాధించిన రైతులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

- జిల్లా కలెక్టర్ శివశంకర్
- అధిక దిగుబడులు సాధించిన రైతులకు సన్మానం

నరసరావుపేట: ప్రస్తుతం జిల్లాలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ కాల పరిమితి పంటలను రైతులు సాగుచేసేలా వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి, జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి వ్యవసాయ సలహామండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి అధ్యక్షత వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. నాగార్జునసాగర్ నుంచి కుడి కాలువ ద్వారా కేవలం తాగునీటి అవసరాలకే నీరు విడుదల చేయటం జరుగుతుందని వెల్లడించారు. ఉపాధి హామీ పథకం కింద రైతుల అంగీకారంతో వారి పొలాల్లో నీటికుంటలు నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ కంది పంటలో అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయాధికారులు పర్యవేక్షించాలన్నారు. కంది పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. చైర్మన్ కుర్రి మాట్లాడుతూ రైతులు తమ పొలాలను ఖాళీగా ఉంచకుండా పశువుల మేతకు కావాల్సిన వివిధ పశుగ్రాసాలను సాగుచేయవచ్చన్నారు. ఆగిన బోర్లను జలకళ ద్వారా వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఎన్ఎస్పీ ఎస్ఈ వరలక్ష్మి మాట్లాడుతూ తాగునీటి కోసమే విడుదల చేసే నీటిని చెరువులకు చేరటంలో రైతులు సహకరించాలని చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి మురళి మాట్లాడుతూ రబీలో సాగుచేసే వరి, మొక్కజొన్న పంటలకు ప్రత్యామ్నాయంగా శనగ, మినుము, పెసర, నువ్వుల పంటలను సాగుచేసే విధంగా ప్రోత్సహించనున్నట్లు వివరించారు. రైతుకు వందనం నిర్వహించి అధిక దిగుబడులు సాధించిన రైతులను సన్మానించారు. జిల్లా స్థాయి వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

క్లెయిమ్‌లు సత్వరమే పరిష్కరించాలి

ఓటరు జాబితా ప్రత్యేక సారాంశ సవరణ–2024లో భాగంగా క్లెయిమ్స్ జాగ్రత్తగా పరిశీలన చేసి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలతో సమీక్ష సమావేశం సోమవారం సాయంత్రం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా జిల్లా కలెక్టర్ పరిశీలించి క్లెయిమ్స్, ఫిర్యాదులను ఎలా డిస్పోజ్ చేస్తున్నారో ఆరా తీశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి ఫాం–7 దరఖాస్తులను ఎలా డిస్పోజ్ చేస్తున్నారు, ఏమేమి చెక్‌లిస్ట్ పెడుతున్నారు అనేది జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఫాం–7,8, ఫొటో సిమిలర్ ఎంట్రీస్‌లకు సంబంధించి అవసరమైన చర్యలు జాగ్రత్తగా తీసుకోవాలని కోరారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులు, వివిధ రాజకీయ పార్టీలు లేవనెత్తిన అంశాలను పరిగణలోకి తీసుకొని చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఖోఖో పోటీలు

నేడు సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు



బాలికల విభాగంలో పోటీపడుతున్న క్రీడాకారులు

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో ఏపీ సబ్ జూనియర్ అంతర జిల్లాల బాల, బాలికల ఖోఖో పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. సోమవారం లీగ్ దశలో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి. పోటీలను డీఈఓ కె.శామ్యూల్, డెప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తితో ఆటలో పాల్గొన్నాలని సూచించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అతిథ్యం కల్పించిన శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పార్వతి, వ్యాయామ ఉపాధ్యాయులు ఝాన్సీరాణిలను అభినందించారు.

క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరిన జట్లు...

బాలుర విభాగంలో విజయనగరం, కృష్ణ, గుంటూరు, చిత్తూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, అనంతపురం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం, చిత్తూరు, గుంటూరు, కడప, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, నెల్లూరు, ప్రకాశం, అనంతపురం, కర్నూలు, విశాఖపట్నం, కర్నూలు, కృష్ణా జట్లు ప్రతిభ చాటి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి. మంగళవారం సెమీఫైనల్, ఫైనల్ పోటీలను నిర్వహించనున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

నరసరావుపేట రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం పట్టణ శివారులోని ఇంజినీరింగ్ కళాశాలలో చోటుచేసుకుంది. వివరాలు.. ప్రకాశం జిల్లాకు చెందిన విద్యార్థిని పట్టణంలోని ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం ఈసీఈ చదువుతోంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో బాత్‌రూమ్‌లోకి వెళ్లి హెయిర్‌లోషన్ తాగింది. కొంత సేపటికి వాంతులు కావడంతో గమనించిన తోటి విద్యార్థులు హాస్టల్ వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందింది. ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.